


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### బతుకు రచ్చబండ

"**పెరుగు ఎందుకు** జిగురుగా వుందీ? పాలు సరిగ్గా లేవా?" భర్త కంచం ముందు కూర్చుని భోంచేస్తూ చిరాగ్గా అడిగాడు.

"అమ్మా వర్షం వస్తుందని నీకు తెలీదా? నా షర్ట్, నిక్కర్ చూడు ఎలా మురికిగా తయ్యారయ్యాయో. రెయిన్ కోట్, అంబరిల్లా బ్యాగ్‌లో పెట్టచ్చుగా!"

"మమ్మీ నా ఫేస్ మీద పింపుల్ వచ్చింది నేను నీతా పెళ్ళి మెహందీకెళ్ళాలి ఇవాళ. నువ్వు ఆయిల్ ఎక్కువ వాడుతున్నావ్ వంటలో" కూతురు కంప్లైంట్.

"అమ్మా కాస్త అన్నం పెట్టమ్మా" ముష్టివాడి పిలుపు.

ఆమె రాత్రి మిగిలిన అన్నం, పులుసూ తెచ్చి వెయ్యబోయింది.

"ఆగమ్మా అన్నం ఎర్రగా వుందేం?"

"దాన్ని బ్రౌన్ రైస్ అంటారయ్యా. చాలా కాస్ట్లీ. 199రూ కిలో ఆర్గానిక్ కూడానూ."

"అయ్యన్నీ జబ్బులున్న మీలాంటివాళ్ళకమ్మా. నాకొద్దు. నేను మంచి అన్నం తింటా" అని ఇంకో ఇంటివైపు కదిలిపోయాడు.

పనిమనిషి సణుగుడు "ఇల్లు తుడవడానికి ఎదురింటావిడ, నిమ్మకాయ వాసన వేసే లోషన్ ఇస్తుంది. మీరేమో ఫినాయిల్ ఇస్తారు. నాకీ వాసన పడదు. ఛీ"

ఇంతలో పెద్ద కూతురు ఫోన్ "అమ్మా నేనూ, ఆయనా రెండు రోజులు రిసార్ట్స్ కెళ్తున్నాం వీకెండ్‌లో. నువ్వు సోనీని చూస్కో"

"అలాగే అమ్మా" అందామె.

"కానీ నీ ఇష్టం వచ్చినట్లుకాదు. నేను చెప్పినట్లు చూసుకో. మార్నింగ్ మిల్క్, తర్వాత బ్రెడ్ మధ్యాహ్నం ఫుడ్ తర్వాత బాత్. ఈవినింగ్ వాక్. దాని సోప్, పౌడర్ అన్నీ సెపరేట్‌గా పెట్టు. అన్నట్లు దానికి పాలు గోరు వెచ్చగా వుండాలి. కొంచెం చల్లారినా, కాస్త వేడి ఎక్కువైనా తాగదు" ఇలా లిస్ట్ చెప్పి ఫోన్ పెట్టేసాక ఆమె భర్తతో అంది "ఆ సోనీని నేను చూడలేను. ఎలా చూసినా మీ కూతురు సణుకుతూనే వుంటుంది. మళ్ళీ నామీద వదిలి పెట్టి పోతుంటుంది"

"ఏం? ఇంకో పిల్ల వుంటే చూసుకోవా?" టై కట్టుకుంటూ భర్త చిరాకు పడ్డాడు.

"ఇంకో పిల్ల ఇలా కార్పెట్‌నిండా, సోఫాల నిండా బొచ్చురాలుస్తూ తిరగదు" అంది. సోనీ బొచ్చుకుక్క పిల్ల.

"పిల్లలు సరదాగా తిరగాలి అంటే మనం చూసుకోవాలి. తప్పదు" అన్నాడు భర్త.

ఇక్కడ 'మనం' అంటే 'నువ్వు'గా గమనించాలి. ఆమె కర్చీఫ్ అందిస్తూ "మీ అక్కయ్య ఫోన్ చేసారు. చెప్పడం మర్చిపోయాను" అంది.

"నీకింత మతిమరుపు అయితే ఎలా? డాక్టర్‌కి చూపించుకో. ఏం చెప్పింది?" కోపంగా అడిగాడు.

"వాళ్ళ ఇన్‌వర్టర్ బాగు చేయిస్తా అని చెప్పి మీరు తెచ్చి ఐదు నెలలు అవుతోందిట. ఎన్ని సార్లు చెప్పినా 'మర్చిపోయా, ఈరోజు చేయిస్తా' అంటున్నారట మీరు" అంది.

అతను తల పట్టుకుని "మరి నువ్వేం చేస్తున్నావు? గుర్తు చేయచ్చుగా? 'మాకు' సవాలక్ష పనులుంటాయి. జ్ఞాపకం వుండదు" అన్నాడు.

ఇక్కడ 'మాకు' అంటే అతనికి అని గమనించాలి.

"ఇవాళ టింకూగాడి స్కూల్‌కి వెళ్ళాలి" ఆమె చెప్పింది.

"ఏమిటి ప్రోబ్లం?" షూస్ వేసుకుంటూ అడిగాడు.

"టీచర్ రమ్మంది"

"వెళ్ళు. ప్రోబ్లెమ్ ఏవుందీ?"

"ఏదో ఎక్స్‌కర్షనట. డబ్బు కట్టమంటుంది."

"మనం కట్టలేం అని మనమే శలవల్లో తీసుకెళ్తాం అనీ ఆవిడకి చెప్పు"

"రమ్మన్నది నన్ను కాదు. మిమ్మల్ని."

"మా ఆయనకి కుదరదు. బిజీ అని చెప్పలేవా? అన్నీ నాదాకా తీసుకు రావాలా? చిన్న చిన్నవి కూడా మేనేజ్ చెయ్యలేవు. ఛీ! ఎందుకూ పనికిరావు" చిరచిరలాడాడు.

బయటకి వెళ్తుంటే, ఎవడో గేట్ దగ్గర, నిప్పులు చెరుగుతూ వెల్డింగ్ చేస్తున్నాడు.

"ఎవడు వాడు? ఏం చేస్తున్నాడు?"

"వెల్డింగ్ చేస్తున్నాడు. గేట్‌కి మధ్యలో బద్దలు వూడాయి."

"నాకు చెప్పక్కర్లేదా? ఎవడ్ని పడితే వాడిని ఇంటిలోపలికి రానిస్తావా?"

"చిన్న చిన్న విషయాలు మీ దాకా ఎందుకనీ?"

"మాటకి మాటా చెప్తున్నావా? అయినా అది చిన్న విషయాలా? నేను వెళ్ళగానే వాడు లోపలికొచ్చి నీ పీక మీద కత్తి పెట్టి, బీరువా తాళాలు అడిగితే?"

"మీరు వెళ్ళగానే ఎందుకూ? మీరు వుండగా ఆ పని చెయ్యచ్చుగా. అప్పుడు మీరేమైనా ప్రభాస్‌లా అతన్ని ఎత్తి పారేస్తారా? అల్లు అర్జున్‌లా అతనితో ఫైట్ చేస్తారా?"

"అంటే నీకు నేను పనికిరాని వాడిలా కనిపిస్తున్నానా? ప్రభాస్, అల్లు అర్జున్‌లు కావాలా? మరీ చవటని కాదే!"

ఆమె మాట్లాడలేదు. దాంతో అతనికి ఇంకా కోపం వచ్చింది. కారు దగ్గరకొచ్చి 'కెవ్వున' కేక పెట్టాడు.

"నా కారుని ఎవడో గుద్ది వెళ్ళాడు. చూడు ఎలా సొట్ట పడిందో. ఎవడువాడు?"

"అవునండీ ఆ చివరింటి యాదగిరి పొద్దుట రివర్స్ చేస్తూ మన కారుకి తగిలించాడు. ఇప్పుడు ఇంట్లోనే వుంటాడు వెళ్ళి నాలుగూ దులిపి, రెండు తగిలించి రండి" అంది.

"ఏవే? వాడు ఈ పేటకి గూండా. నేను ప్రాణాలతో వుండాలని లేదా నీకు? ఎలా కనిపిస్తున్నాను నీ కళ్ళకి?" అరిచాడు.

"ఇందాకేగా మరీ చవటని కాదు అన్నారూ" ఆమె సాగదీసింది.

"అఘోరించాం నీ తెలివికి. సెల్‌ఫోన్ మర్చిపోయా ప్రటా. అయినా అన్నీ నాకు గుర్తు చెయ్యాలని తెలీదూ? మొద్దాని"

"తెలుసు తల దువ్వుకోలేదు మీరు"

"మీరు తల మాసినాడులా వున్నారూ. అడుక్కునే వాడిలా వున్నారూ. ఇలాంటివి కాదు గుర్తు చెయ్యమన్నది" మండిపడ్డాడు.

"ప్యాంట్.." అనబోయింది.

"అరె ఇది స్టైలు. నా స్వంత విషయాల్లో వేలెట్టకు" గుర్రుమన్నాడు.

"కాదండీ మీరు ప్యాంట్"

"ఏం నీ ఇష్టం వచ్చిన బట్టలేసుకోవాలా? నా ఇష్టం వచ్చినట్లు వుంటా. అంతా నా యిష్టం."

"వేసుకోండి. కానీ ప్యాంట్ జిప్ పెట్టుకోలేదు" ఆమె గబగబా చెప్పేసింది.

"ఓ అదా మరి ప్రొద్దుట లేచిన దగ్గర్నుండీ. నీ నస. బోలెడు పనులు నాకు మరి మరుపు రాదూ? అందుకే మర్చిపోయా అవునూ సుమతీ మధ్యాహ్నం అలా టైలర్ దగ్గరకెళ్ళి నా ప్యాంట్‌లు కుట్టాడేమో అడిగిరా"

"ఇవాళ కుదరదండీ. బోలెడు పని వుంది."

"ఏం పనీ? తిని కూర్చుని టీవీలో బతుకు జట్కా బండో, సంసారం చదరంగమో చూడ్డమేగా?"

"అవునండీ బూడిద గుమ్మడికాయ తెచ్చాను. వడియాలు పెడ్దామని, తరుగుతూ చూస్తాను. టింకూగాడి పుస్తకాలకి అట్టలేయాలి. అవి వేస్తూ చూస్తాను. లేదా మీ అమ్మగారు వుసిరికాయలు పంపారు. అవి దంపుతూ చూస్తాను."

"మొత్తానికి చూడ్డం తప్పదన్నమాట. ఏం వస్తుందే అవి చూస్తే?" "మీకు నెలకి లక్షరూపాయల జీతం కాబట్టి, నాకు నెలకి పాతిక వేలు భరణం వస్తుంది. ఈ ఇల్లూ, వూళ్ళో పొలం స్వార్జితం కాబట్టి, వీటిల్లోనూ భాగం వస్తుంది. మీ నాన్నగారి ఆస్తిలో నాకూ పిల్లలకీ, మీ దాంట్లో మళ్ళీ పిల్లలకీ వాటా వస్తుంది"

"ఏవిటే? ఏం మాట్లాడ్తున్నావ్?" నోరు తెరిచేసాడు.

"గృహహింస చట్టం కింద మీమీద 492, 406, మొదలైన కేసులు పెట్టచ్చు."

"కేసులా?"

"అవును. నేను మర్చిపోతే ఏ పనైనా పనీపాటా లేక ఒళ్ళు బలుపు. మీరు మర్చిపోతే పని వత్తిడీ, మానసిక రుగ్మతా, అలాగే నేను స్వతంత్ర నిర్ణయాలు చివరికి గ్రిల్ బాగు చేయించడానికి కూడా తీసుకోకూడదూ. మీరు నా ప్రతి స్వవిషయం గురించీ నిర్ణయాలు చేసేస్తుంటారూ. పాలు జిగురొస్తే నేను కారణమా? నేను బర్రెని పితికి తెచ్చానా? మీరు ఏదైనా చెయ్యకపోతే దానికీ నేనే కారణమా? గుర్తుచేస్తే భరించలేరు చెయ్యకపోతే బతకలేరు."

"ఆ?"

"ఇలాంటివి చాలా తెలుస్తాయండీ ఆ రచ్చబండలూ, సంసారం ఓ చదరంగాలూ, బతుకు జట్కా బండిలూ చూస్తే" అంది ఆనందందగా సుమతి.

"అమ్మో. ఇంతింత ప్రమాదాలున్నాయా? కేబుల్ కనెక్షన్ కట్ చేయించేస్తా.. అయితే"

"అదీ గృహహింస కిందకే వస్తుందండీ"

"అసలు నిన్ను కాదే నిన్ను ఇలా పెంచిన మీ అమ్మా నాన్నల్ని అనాలి. మొద్దావతారాన్ని నా పీకకి చుట్టారు"

"ఇలా నా పుట్టింటి వాళ్ళని తిడ్తే ఇంకా పెద్ద కేసు అండీ"

"నేను తిట్టానని ప్రూఫ్ ఎవరూ?"

"నేను సెల్‌లో మీరు తిట్టినప్పుడల్లా రికార్డ్ చేస్తున్నానండీ"

"ఇదెక్కడ నేర్చుకున్నావ్?"

"అదీ ఈ ప్రోగ్రాముల ద్వారానే అండీ. అంతేకాదు. మీరు మీ ఆఫీస్‌లో మార్గరెట్‌కి మొన్న రాత్రి బాత్‌రూమ్‌లో నుండి ఫోన్ చేసారు. నేను కాల్ హిస్టరీ చూసా. ఎడల్టిరీ కింద బుక్ చేయిస్తా మిమ్మల్ని"

"అయ్యో రేపు ఆఫీస్‌కి లేట్‌గా వస్తా బాస్‌కి చెప్పండి మేడం అని ఫోన్ చేసానే బాబూ!" అతను లబలబలాడాడు.

"ఏమో ఈ మధ్య 5.45కి రావలిసినవారు 5.48 నిమిషాలకి వస్తున్నారు. అదీ నోట్ చేసి పెట్టానండీ"

"ఒసే ఎందుకే ఇలా తయ్యారయ్యావ్?"

"ఎప్పుడూ మొద్దూ, బుద్ధావతారం అంటున్నారు కదా అందుకే కాస్త తెలివితేటలు నేర్చుకుంటున్నానండీ."

"ఈ ప్రోగ్రామ్స్ ద్వారానా?"

"అవునండీ మీకు లాయర్ ఫీజులూ, కోర్టుకి తిరగడాలు లేకుండా సులభంగా పరిష్కారం అయిపోతుంది. తేలిగ్గా మనం విడిపోవచ్చు. పైగా మీకు ప్యాంటూ షర్టూ, నాకు చీరా, జాకెట్టూ పెట్టి పంపిస్తారు"

"ఇప్పుడు ఎందుకే విడిపోవడం?"

"ప్రొద్దుట లేచినప్పటి నుండీ పేపర్ లేట్‌గా వస్తే నాదే తప్పు. పాలు పలచగా వుంటే నాదే తప్పు. పనిమనిషి ఆలస్యంగా వస్తే నాదే తప్పు. గోరు చిక్కుడుకాయలు ముదురుగా వుంటే నాదే తప్పు. టీ.వీ ప్రసారంలో అంతరాయం వస్తే నాదే తప్పు. వానపడితే నాదే తప్పు. ఎండకాస్తే నాదే తప్పు. మిమ్మల్ని చూసి పిల్లలుకూడా అన్నింటికీ నన్నే తప్పు పడ్తూ పనులు తప్పించుకుంటున్నారు. నీ పెద్ద కూతురి కుక్క పిల్ల బొచ్చు వూడడానికీ, చిన్న కూతురు మొహం మీద మొటిమ రాడానికీ, మీ కుర్రాడు వానలో తడిస్తే జలుబురాడానికి అన్నింటికీ నేను ఒకత్తెని మీ కళ్ళకి కనిపిస్తుంటాను. ఈ పనీ పాటలు ఏవో ఇంకొకరి ఇళ్ళల్లో చేస్తే నేను మన నరసమ్మకిచ్చినట్లు వేడి వేడి కాఫీలూ, ప్రొద్దుటే పొగలుకక్కే ఇడ్లీలూ, పండక్కి కొత్త చీరా, నా యిష్టం వచ్చినప్పుడు పనికి శలవలూ అన్నీ వుంటాయి. ఎలా వుంది ప్లాన్?"

అతని మొహం చిన్నబోయింది.

"అయినా భరణం ఇప్పిస్తారు నా జీవితానికి రోజా అమ్మా, సుమలతమ్మా. కాలుమీద కాలేసుకుని కూర్చోవచ్చు. మీరు గొడ్డుని బాదినట్లు బాదుతుంటే ఎన్నాళ్ళని భరిస్తానూ?"

"నేనెప్పుడు బాదానే? చీమకి కూడా అపకారం చెయ్యలేని వాడినీ?"

"అబ్బా.. గొడ్డుని బాదినట్లు బాదారని చెప్పాలండీ. అందరూ అలాగే చెప్తారు"

"అలా బాదితే ముప్పై ఏళ్ళు ఎలా కాపురం చేస్తావే?" పాయింట్ లేవదీసాడు భర్త.

"తల పగిల్తే కుట్లు వేసుకుంటూ, కాళ్ళకీ, చేతులకీ కట్లు కట్టించుకుంటూ ఇలా బతుకు ఈడుస్తున్నాను."

"నువ్వు చెపితే మాత్రం ఎవరు నమ్ముతారే?"

"ఆ గేట్‌కి వెల్డింగ్ చేస్తున్న ఫకీరూ, ఇంతకు ముందు మన పక్కింట్లో వుండి వెళ్ళిన ముత్తమ్మాళ్ సాక్ష్యం చెప్తారు"

"ఏం చూసారని చెప్తారు?"

"ముత్తమ్మాళ్‌కి తెలుగురాదు. మీరు మాట్లాడిన వన్నీ బండబూతులని నేను చెపితే నమ్ముతుంది. అలాగే ఆ ఫకీర్‌కి చెవుడు. మీరు అరిచి నన్ను కొట్టడం చూసానని, సారా డబ్బులు చేతికిస్తే సాక్ష్యం చెప్తాడు."

"ఇన్ని తెలివితేటలు ఆ టీ.వీ ఛానెల్ వాళ్ళ పుణ్యమేనటే?"

"అవును అండీ. టీ.వీలో కనపడితే మా గణపారంలో కూడా అందరూ చూస్తారు. మా లక్ష్మమ్మ కూతురు టీ.వీలో కనిపించిందని మా అమ్మని గొప్పగా చెప్పుకుంటారు."

"ఏవిటీ మొగుడ్ని వదిలేసి మొగసాలకెక్కితేనా?"

"అబ్బా. ఏం చేస్తేనేం? టీ.వీలో కనిపిస్తా కదండీ. అన్నట్లు మన పక్కింటి పంకజాన్ని కూడా తీసుకెళ్ళచ్చు. కొత్తగా నెక్లెస్ చేయించుకుంది. నలుగురికీ చూపించినట్లు అవుతుంది. టింకూగాడినీ, బుజ్జినీ తీసుకెళ్తే, మా నాన్న స్కూల్ ఎక్స్‌కర్షన్‌కి డబ్బులు ఇవ్వలేదనీ నలుగురిలో ఒంటినిండా బ్రాండెడ్ బట్టలు లేక చిన్నతనంగా వుందనీ, గ్లిజరిన్ వేసుకుని ఏడుస్తూ చెప్తారు."

"ఏవిటే ఇదీ? టీ.వీ.ల వల్ల  వచ్చే మీ ఎడ్యుకేషన్ ఇదా? బతుకు బజార్న వేసుకుని, ఇంటి గుట్టు రచ్చకీడ్చుకోవడమా?" అతనికి ఏడుపొచ్చింది.

"మరి. నన్ను చీటికీ మాటికీ విసుక్కోరుగా? నా పుట్టింటి వాళ్ళని ఏవీ అనరుగా?"

"అనను"

"అయితే ఆ ప్యాంటూ షర్టూ విప్పి లుంగీ కట్టుకుని."

"కట్టుకుని?" భయంగా చూసాడు.

"ఉసిరికాయలు దంపండి. నేను టీ.వి చూడాలి. రచ్చబండ వచ్చే టైం అయింది."

ఆమె విజయ గర్వంతో సివంగిలా అతను బతుకు భయంతో పిల్లిలా ఇంట్లోకి నడిచాడు.

"ఇది కథకాదు .. జీవితం.." అని బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్  టీ.వీలో వస్తోంది.

COMMENTS

